క్లుప్తంగా

చేతి పంపులకు మరమ్మతులు



చేతి పంపులో కొత్త పైపులు ఏర్పాటు చేస్తున్న కూలీలు

పాములపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సర్పంచు మేకల భాగ్యమ్మ ఆదివారం చేతి పంపుల మరమ్మతులు చేయించారు. ఆమె మాట్లాడుతూ చాలా సంవత్సరాల క్రితం చేతి పంపులో ఏర్పాటు చేసిన పైపులు తుప్పుపట్టాయన్నారు. వాటి స్థానంలో కొత్త పైపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చేతి పంపులో నీరు పుష్కలంగా ఉందని, కాలనీ వాసులకు అవసరాలకు ఈ చేతి పంపు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న దినేష్‌కుమార్

ఆత్మకూరు: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.దినేష్ కుమార్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సాయిప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సెలవు దినాల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. ప్రత్యేక తరగతులకు గ్రామీణ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు దిలీప్‌బాబు, అంజి, రవి, భరత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ రామచంద్రకు మెమొంటో అందిస్తున్న ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రామచంద్ర, కుటుంబ సభ్యులు ఆదివారం పూజలు నిర్వహించారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

మహానందిలో సండే సందడి



మహానందీశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: మహానంది ఆలయానికి ఆదివారం సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తులు సాధారణ, ఉచిత, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల ద్వారా శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం జరిగిన అష్టవిధ మహామంగళ హారతుల సమయంలో భక్తులు స్వామివారి నిజరూపంతో పాటు హారతులు తిలకించారు.

ఈక్రాప్ బుకింగ్ గడువు పొడిగింపు

జూపాడుబంగ్లా: ఈ క్రాప్ బుకింగ్ గడువును ఈనెల ఆఖరు వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నేటితో ఈ పంట నమోదు ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా రైతుల సౌకర్యార్థం ఈనెల 30 వరకు పొడిగించినట్లు తెలిపారు.

మాజీ సీఎం జగన్‌ను విమర్శించడం హేయం



విద్యారంగానికి పెద్దపీట వేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని విద్యాశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ విమర్శించడం హేయం. పేదవిద్యార్థులు కూడా డాక్టర్లు కావాలనే సంకల్పంతో ప్రతి జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ తీసుకొచ్చిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుంది. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ మెడికల్ కళాశాలలను ప్రవేవేటీకరణ చేసేందుకు పూనుకుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం చేసేందుకు టీడీపీ కుట్రలు పన్నుతోంది. ఇప్పటికైనా మంత్రి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి. టీడీపీ ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని మార్చుకుని పేద విద్యార్థులకు అండగా నిలువాలి.

– వెంకటేశ్వరనాయక్, ఎస్.ఎన్.తండా

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన జగన్



పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసిన విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసు. పేద విద్యార్థులు కూడా డాక్టర్లు కావాలనే సంకల్పంతో ప్రతి జిల్లాకు ఓ మెడికల్ కళాశాలను మంజూరు చేయడంతోపాటు శరవేంగా నిర్మాణాలు చేపట్టారు. మంత్రి సత్యకుమార్ తీరు మరీ విచిత్రంగా ఉంది. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం వైద్యవిద్యను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు పన్నుతోంది. టీడీపీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకుంటే పేదల నుంచి తిరుగుబాటు చవిచూడాల్సి వస్తుంది.

– వరాల మాలిక్, ఆత్మకూరు

పంటలు నష్టపోయిన రైతుల జాబితా ప్రదర్శన

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలకు పంటలు నష్టపోయిన రైతుల జాబితాను ఆయా రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. సామాజిక తనిఖీ నిమిత్తం రైతు సేవా కేంద్రాల్లో ప్రచురించినట్లు చెప్పారు. రైతులు తమతమ వివరాలను సరి చూసుకోవాలన్నారు. ఏవైనా తప్పులు ఉంటే వ్యవసాయ సిబ్బందికి తెలియజేసి సరి చేసుకోవాలని సూచించారు.

కూర'గాయాలు'



వారపు సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

పాములపాడు: కొనలేం... తినలేం అన్నట్లుగా ఉంది సామాన్యుడి పరిస్థితి. నిత్యావసర సరుకుల ధరలు భగభగమంటున్నాయి. నూనె రేట్లు సలసల కాగుతున్నాయి. ఇక కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఎక్కువ కూరగాయల ధరలు రూ. 60 పైమాటే. ఓ వైపు పచ్చిమిర్చి రేటు గిట్టుబాటవ్వక రైతులు పైర్లను దున్నేస్తుండగా మార్కెట్‌లో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. కిలో మిర్చి రూ. 30 పలుకుతుంది. మిర్చి సాగు చేసిన రైతులు లాభాలు రావడం లేదు...కొనుగోలు చేస్తున్న సామాన్యులకూ ధర అనుకూలంగా లేదు. మధ్యన వ్యాపారులు మాత్రం లాభాలు గడిస్తున్నట్లు ఉంది పరిస్థితి. మండల కేంద్రం పాములపాడులో ఆదివారం నిర్వహించిన వారపు సంతలో కూరగాయల ధరలు ఆకాశన్నంటాయి. టమాటా, ఉల్లిగడ్డ మాత్రం కిలో రూ.30 చొప్పున కొంతమేర సామాన్యుడికి అందుబాటులో ఉన్నాయి. ఇక వంకాయ, మటిక్కాయ, ఆలుగడ్డ, బీరకాయ, క్యారెట్ తగ్గేదేలే అంటున్నాయి. ఈ కూరగాలన్నీ కిలో. 60 చొప్పున కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇక చిక్కుడు, బీట్ రూట్ ధర పేదలకు అందనంతగా అమాంతం పెరిగిపోయాయి. కిలో ఏకంగా 80 చొప్పున రేటు సాగింది. దీంతో సామాన్యులు అటువైపు కన్నెత్తి చూడలేదు. గతవారంతో పోలిస్తే కూరగాయాల రేట్లు ఏకంగా 10 శాతం పెరిగాయని పేద మహిళలు నిట్టూర్చారు. తప్పని పరిస్థితుల కిలో కొనాల్సిన వాటిని అరకిలోతో సరిపుచ్చుకున్నారు. రూ. 500 వందలు తీసుకెళ్లినా సంచి కూడా నిండ లేదని మహిళలు వాపోయారు.



చీరకట్టిన చేను

పాములపాడు: అడవి పందుల బారి నుంచి పైర్లను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. బానుముక్కల, బానకచెర్ల, వేంపెంట, ఇస్కాల, చెలిమల్ల, లింగాల, ఎర్రగూడూరు, పాములపాడు గ్రామాల పరిధిలోని మొక్కజొన్న పైరు కంకి దశలో ఉంది. అడవి పందుల బారి నుంచి కాపాడుకునేందుకు రైతన్నలు చేను చుట్టూ చీరలు కడుతున్నారు. రంగురంగుల చీరలకు పందులు భయపడి పొలంలోకి రావని రైతులు పేర్కొంటున్నారు.

శ్రీశైలంలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం ప్రారంభం



శ్రీశైలంలో కార్మికులతో కలిసి పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్న ఈఓ, సీఐ, ఈఈలు

శ్రీశైలంటెంపుల్: రాష్ట్ర దేవదాయశాఖ ఆదేశాల మేరకు శ్రీశైల మహాక్షేత్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఆదివారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ప్రారంభించారు. ప్రధాన ఆలయం ఎదుట గంగాధర మండపం వద్ద దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, సీఐ ప్రసాదరావు, కార్మికులతో కలిసి ఈఓ స్వయంగా చీపురుపట్టి రోడ్లను శుభ్రం చేశారు. అక్టోబరు 2వ తేది వరకు ప్రతిరోజు ప్రధాన రహదారులు, పంచమఠాల ప్రాంగణాలు, పాతాళగంగ మెట్ల మార్గం, అన్నప్రసాద వితరణ భవనం తదితర ప్రాంతాల్లో అక్టోబరు 2వ తేది వరకు ప్రత్యేకంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం జరుగుతుందని ఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ రమణమ్మ, ఈఈ రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, సహాయ కార్య నిర్వహణాధికారి స్వాములు, శ్రీశైలం సీఐ ప్రసాదరావు, పలు విభాగాల పర్యవేక్షకులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

నందికొట్కూరు: వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేసిన ఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చంద్రశేఖర్ అనే వ్యక్తి మినీ లారీ అసోసియేషన్‌లో గుమస్తాగా పని చేసేవాడు. అసోసియేషన్ నాయకులు అతడిని తొలగించి రాఘవేంద్ర అనే వ్యక్తిని గుమస్తాగా నియమించుకున్నారు. ఇది జీర్ణించుకోలేని చంద్రశేఖర్.. రాఘవేంద్రపై దాడికి పాల్పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అతడిని పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రి తరలించి చికిత్స చేయించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాధవస్వామి తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



చెన్నరాయుడు(ఫైల్)

జూపాడుబంగ్లా: ఈనెల 13న జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన చెన్నరాయుడు(40) కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. ద్విచక్రవాహనంపై నందికొట్కూరుకు వెళ్తూ మార్గమధ్యలో తంగడంచ వద్ద నిలిపి ఉన్న బైక్‌ను ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. ఇతనికి భార్య కళావతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి



పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని పలు కాలనీల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి రోడ్ల నిండా చెత్తతో, డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, సీనియర్ నాయకులు ఎం.రజాక్, డి.రామ్‌నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం పారిశుద్ధ్యం లోపించిన ప్రాంతాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని 24 వార్డులతో పాటు మెయిన్ రోడ్డు ప్రధాన కూడళ్లలో చెత్తను రోజూ శుభ్రం చేయాల్సి ఉండగా డంపుయార్డుకు రోడ్డు లేదన్న నెపంతో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉందన్నారు. గతంలో మున్సిపల్ కార్మికులు సమ్మె చేసే క్రమంలోనూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇతరులు చొరవ తీసుకొని పట్టణంలో చెత్తను తొలగించాలని ఒత్తిడి తెచ్చేవారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని, ఇంత నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు పట్టణంలో పేరుకుపోయిన చెత్తాచెదారం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. చెత్తాచెదారం పేరుకుపోయిన దోమలువ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యాలబారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కార చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

ఆత్మకూరు: ఆత్మకూరు మండల న్యాయవాదుల సంఘం, న్యాయవాదుల గుమస్తాల సంఘం సభ్యులు ఆదివారం విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.లక్షను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి అందజేశారు. ఆపద సమయాల్లో ఉన్న వారికి మానవతా దృక్పథంతో సాయం అందించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. దాతలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేముల వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ గొడుగు రవికుమార్, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం శ్రీశైలం మండలం ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రూ.75,116లను ఆదివారం శ్రీశైలం ఎంఎల్‌ఏ బుడ్డా.రాజశేఖరరెడ్డికి అందజేశారు. అసోసియేషన్ సభ్యుల సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం అందజేశామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జిలానీ, ఎఎస్ ఇస్మాయిల్, షేక్ నజీర్, షేక్ జావేద్, మస్‌జీద్ హఫీజ్, నూర్‌మహమ్మద్ పాల్గొన్నారు.

అలరించిన సంప్రదాయ నృత్యప్రదర్శన



సంప్రదాయ నృత్య ప్రదర్శన ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై వరంగల్ జిల్లా హన్మకొండకు చెందిన శివసాయి కూచిపూడి నృత్య కళాక్షేత్రం వారిచే సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. మూషికవాహన, ఏకదంతాయ, శంభో శివశంభో, జతిస్వరం, ఆదిగదిగో శ్రీశైలం, నటేశకౌత్వం తదితర గీతాలకు సహస్ర, శ్లోక, శ్రేష్ఠ, అక్షర, సమీక్ష తదితరులు నృత్యప్రదర్శన ప్రదర్శించారు.

శ్రీకృష్ణుడిని దైవంగా భావించాలి



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

నందికొట్కూరు: శ్రీకృష్ణుడిని దైవంగా భావించాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు వెంకటేశ్వర్లు, మునిదాసు సూచించారు. ఆదివారం వారు 10 బొల్లవరం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథంపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు కుమారాచారి, పుల్లారెడ్డి, సంజీవ, చక్రపాణి, వెంకటేశ్వర్లు, నాగమద్దిలేటి, పార్థసారథి, శేషన్న, పవన్, ప్రకాష్, రమణమ్మ, చందు, వరలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, నారాయణమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఎంఈఓ- 2 లను కొనసాగించాలి

నంద్యాల(న్యూటౌన్): ఎంఈఓ- 2 లను కొనసాగించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామపక్కీరరెడ్డి, భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ కేసు పెండింగ్‌లో ఉన్నందున ఉపాధ్యాయులకు ఎంఈఓ-1 పదోన్నతులు నోచుకోని కారణంగా ప్రభుత్వం ఎంఈఓ-2లను కొత్తగా నియమించారన్నారు. ఒకరికి అడ్మినిస్ట్రేషన్ మరొకరికి అకాడమిక్ బాధ్యతలు అప్పగించారు. ఎంఈఓ- 2లను రద్దుచేస్తే దాదాపు 650 కి పైగా గజిటెడ్ పోస్టులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పోస్టులలో విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. మధ్యంతర భృతి, సంపాదిత సెలవులు తదితర బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు సుమయోన్, జగదీశ్, శ్రీమౌలిరెడ్డి, రాజశేఖరరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల చిన్నారికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



సాయిహవీష్‌ను అభినందిస్తున్న కోటేష్

నంద్యాల(అర్బన్): పట్టణానికి చెందిన పల్లా రమేష్, స్వర్ణ దంపతుల కుమారుడు సాయిహవీష్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. స్థానిక కోటేష్ అకాడమీలో ఆదివారం జరిగిన అభినందన సమావేశంలో ప్రముఖ చిత్రకారుడు కోటేష్ చిన్నారిని అభినందించి మాట్లాడారు. ఏప్రిల్ 14న బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని సాయిహవీష్ డ్రాయింగ్ చార్ట్‌పై 3,022 బొట్టు బిల్లలతో అంబేడ్కర్ పొట్రాయిట్ చిత్రాన్ని గీసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకు పంపగా..రికార్డు ఎడిటర్ డాక్టర్ బిష్వరూప్ రాయ్ చౌదరి చిన్నారి వేసిన చిత్రాన్ని పరిశీలించి ఇది అద్భుత ప్రయోగమని ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం కల్పిస్తున్నట్లు తెలిపారన్నారు. సర్టిఫికెట్, గోల్డ్‌మెడల్, గుర్తింపు కార్డులను కొరియర్ ద్వారా పంపారని చెప్పారు.

నందీశ్వరస్వామికి పరోక్ష పూజలు



శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహా క్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి ఆదివారం శాస్త్రోక్తంగా అర్చకులు పరోక్షసేవ పూజలను నిర్వహించారు. శుద్ధ త్రయోదశి, బహుళ త్రయోదశి రోజులలో నందీశ్వరస్వామి పూజను భక్తులు పరోక్షంగా నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. 13మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామి విశేషపూజను జరిపించుకున్నారు. నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజలలో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఈ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజను చేశారు.

మద్యం విక్రేతల అరెస్ట్

పగిద్యాల: అక్రమ మద్యం విక్రేతలను అరెస్ట్ చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ సి.శరత్‌కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామానికి చెందిన నరేంద్రప్రసాద్, నల్లబోతుల చరణ్ బైక్‌పై మద్యం తరలిస్తుండగా లక్ష్మాపురం అంచె వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 55 ఏపీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మల్యాల వద్ద కోత కోసిన మినుము పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మినుము పంట చేతికి వచ్చే సమయం ఆసన్నమైందని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, పక్కీర్‌సాహెబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో రైతులు సాగు చేసి కోత కోసిన మినుము పంటను సీపీఎం నాయకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. మినుము క్వింటా రూ, 3.500లకే అమ్మాలని మధ్య దళారులు రైతులపై ఒత్తిళ్లు చేయడం దారుణమన్నారు. మినుము పంట క్వింటా రూ.10 వేలు మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు జయన్న, మధు, శ్రీనివాసులు, చిన్న, రఫి, రమేష్, రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సోయాబీన్ సాగుపై అవగాహన

వెలుగోడు : మండల పరిధిలోని రేగడగూడూరు గ్రామంలో రైతులతో ఆదివారం విగర్ బయోటిక్ మాల్విక కంపెనీ ఏరియా మేనేజర్ రవి ప్రసాద్ రెడ్డి సమావేశమయ్యారు. సోయాబీన్ సాగుపై అవగాహన కల్పించారు. తమ కంపెనీ సరఫరా చేసే సోయాబీన్ విత్తనాలతో అధిక దిగుబడులు వస్తున్నాయని ఆయన చెప్పారు. రీసెర్చ్ సోయాబీన్ పంట తెగుళ్లు తట్టుకొని అధిక దిగుబడి నిస్తుందన్నారు.

నిప్పులవాగుకు 1,313 క్యూసెక్కుల నీటి సరఫరా



బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు వద్ద నీరు

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 1,313 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,500క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తుండగా రైతుల వినియోగానంతరం లాకిన్స్‌లా వరకు 1,646 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు తెలిపారు. ఈ నీటిని నిప్పులవాగుకు 1,313 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌ఛానల్‌కాల్వకు 336 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు.

బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు 30 వేల క్యూసెక్కులు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి 30,000 క్యూసెక్కుల నీటిని ఆదివారం విడుదల చేస్తున్నట్లు జేఈ దేవేంద్ర తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి 30వేల క్యూసెక్కుల నీరు బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరుకు వచ్చి చేరుతుందన్నారు. ఈ నీటిని తెలుగుగంగ(వీబీఆర్)కు 12,000క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్‌కు 15,000క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ ఛానల్‌కు 3000 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని వివరించారు.

కేంద్రానికి చంద్రబాబు లేఖ రాయడం సిగ్గుచేటు

నందికొట్కూరు: రాష్ట్రంలో నూతనంగా మంజూరైన మెడికల్ కాలేజీలకు సీట్లు కేటాయించొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి లేఖ రాయడం సిగ్గుచేటని ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి డక్క కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వైద్య విద్యను అభ్యసించాలన్న పేద విద్యార్థుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లుతోందన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే భవిష్యత్తులో బాబుకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గోస్పాడు: మండలంలోని తేళ్లపురి గ్రామ కుందూ సమీపంలోని పొలాల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపిన వివరాల మేరకు పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తికి చెందిన మృతదేహం ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి సమాచారమివ్వడంతో వెళ్లి పరిశీలించగా శవం గుర్తు పట్టలేనంతగా మారిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఎవరైనా గుర్తిస్తే ఎస్ఐ సెల్ 9121101172 నంబర్‌కు సమాచారం చేరవేయాలని కోరారు.

కోలుకోలేక రైతు మృతి

రుద్రవరం : మండలంలోని ముత్తలూరుకు చెందిన నాగేశ్వరరెడ్డి (44)అనే రైతు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎస్ఐ వరప్రసాదు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు వ్యవసాయం ఆధారంగా జీవనం సాగించేవాడు. వాతవరణం అనుకూలించక సరైన పంట దిగుబడులు రాక దాదాపు.రూ.12 లక్షల వరకు అప్పు అయ్యింది. అప్పు తీర్చలేక పోవడంతో మనస్థాపానికి గురై ఈనెల 12న పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స అందించినప్పటికి కోలకోలేక మృతి చెందినట్లు మృతుడి భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

వేతనాలు చెల్లించాలి

చాగలమర్రి: ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని మండలంలోని స్కావెంజర్లు కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లను శుభ్రపరచి, పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచటానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్ఎంసీల ద్వారా స్కావెంజర్లను ఏర్పాటు చేసిందన్నారు. మండలంలో 49 మంది స్కావెంజర్లు ఉండగా.. వీరికి అప్పట్లో టాయిలెట్ మేయింటెనెన్స్ ఫండ్ ద్వారా ప్రతి నెల రూ. 6000లు వేతనం చెల్లించేవారని చెప్పారు. ఎన్నికలు సమీపించడంతో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు వేతనాలు చెల్లించలేదన్నారు.

జిల్లా షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 19వ తేదీన నంద్యాల జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, కార్యదర్శి పరమేశ్వరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ప్రవేశరుసుముతో వయస్సు ధ్రువ పత్రంతో హాజరు కావాలన్నారు. 2005 ఏప్రిల్ 1 తర్వాత జన్మించిన వారు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.